

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### లైఫ్ విత్‌వుట్ కాంతారావ్!!

కాంతారావు అన్నది మన ఆంధ్రులకి సుపరిచితమైన పేరు.... విఠలాచార్య హీరో, ఇటీవలే దివంగతులైన కత్తి యుద్ధం కాంతారావుగారు.. కానీ నేను చెప్పేది నా దగ్గర సుమారు సంవత్సరం పాటు పనిచేసిన డ్రైవర్ కాంతా రావు విషయం.

పి.జీ.ఉడ్ హౌస్ నవలలు చదివిన వాళ్ళకి 'జీవ్స్' అంత తెలివైన బట్లర్ ఉంటే లైఫ్ ఎంత కాంప్లికేట్ చెయ్యగలదో తెలుస్తుంది! ఈ విషయాన్ని నేను పూర్తిగా జీర్ణం చేసుకుని నా షోఫర్... అదే నా వాహన చోదకుడికి మొదటి అర్హతగా కాస్త తెలివి తక్కువతనం ఉండేలా చూసుకుని ఆనందపడేదాన్ని!

కనీసం డ్రైవర్ అయినా

"మా మేడమ్‌కి చాలా విషయాలు తెలుసు" అనుకోవాలి కానీ,

"ఇన్ని విషయాలు తెలీని ఈవిడ కథలేం రాస్తుందీ? ఈవిడకి ఓ డ్రైవర్ ఎందుకూ?"

అని స్వగతంగా అనుకోకూడదని గతంలో ఆ రూల్ ఫాలో అయ్యేదాన్ని.

ఓసారి ఓ ప్రముఖుడు నాకో గిఫ్ట్ పంపించడానికి మా డ్రైవర్ని పంపించమన్నాడు.

"అతనికి ఎడ్రెస్‌లు తెలియవు" అన్నాను.

"రాసివ్వండి" అన్నారు.

"చదువు రాదు" అన్నాను.

"పోనీ.. గుర్తులు చెప్పండి మా పి.ఏ నెంబర్ ఇస్తాను" అన్నారు.

నేను మా డ్రైవర్ నెంబర్ ఇచ్చాను.

ఇంకో గంటలో ఆయన ఫోన్ చేసి "నేనే మనిషిని పంపిస్తాను... మీరు మీ డ్రైవర్ని పంపించకండి" అన్నారు.

"ఏం?" అన్నాను.

"అతనికి ఫోన్‌లో ఎడ్రెస్ చెప్పడానికి గంట నుండీ మా పి.ఏ కుస్తీ పడుతోంది నా పనులన్నీ ఆగిపోయాయి... అందుకూ" అన్నారు.

"పెద్దగా తెలివైనవాడు కాదండీ... ఓ సారి చూసిన మనుషుల్నీ, ఎడ్రెస్‌లనీ కూడా గుర్తుపెట్టుకోలేడు..." అన్నాను.

"తెలివైనవాడు కాదా? ముందే చెప్పాల్సింది" అన్నారు.

నేను సిగ్గుగా "ఇంకెవరైనా తెలివైన వాడూ దొరికితే తీసేద్దాం అనుకుంటున్నాను" అన్నాను.

ఆయన కంగారుగా "రమణీ ఆ పని చెయ్యొద్దు.. ఇంకో ఐదువందలు ఎక్కువిచ్చి అయినా ఇతన్ని అట్టిపెట్టండి... ఈ కాలంలో తెలివితేటలు లేని డ్రైవర్లు దొరకడం దుర్లభం" అన్నారు.

ఆ రకంగా మా కాంతారావు ఎన్ని సార్లు చూసినా ఓ ఇంటినీ, ఓ ఆఫీసునీ గుర్తుపెట్టుకుని తిరిగి నన్ను సరిగ్గా అక్కడికి చేర్చేవాడు కాదు. మా ఇంటి వెనకాల ఉన్న గుడికి ఊరంతా తిప్పి తీసుకెళ్ళేవాడు! రాత్రి తొమ్మిది దాటితే "నేను నిద్రకి ఆగలేనమ్మా" అని కచ్చితంగా చెప్పేవాడు. అంతటితో ఊరుకునేవాడు కాదు. నేను ఎంత ఇంపార్టెంట్ మీటింగ్‌లో ఉన్నా తొమ్మిదిదాటగానే మిస్డ్ కాల్స్ ఇస్తుండేవాడు. చేరేముందే నాకో కండిషన్ పెట్టాడు. "ఒంటిగంట దాటితే నేను ఆకలికి ఉండలేను... భోజనం డబ్బులు ప్రొద్దుటే ఇచ్చేసి మీరు మీపని చూసుకోండి" అని.

నేను అలాగే చేసేదాన్ని! కానీ మా ఆఫీసులోనో, షూటింగ్ స్పాట్‌లోనో మళ్ళీ భోజనం చేస్తూ కనిపించేవాడు. నేను వేటినైతే పెద్దగా లెక్క చెయ్యనో ఆ 'ఆకలి.. నిద్రలు' ఇతనికి ఎక్కువ! సర్లే పాపం.. అని సరిపెట్టుకున్నాను. కానీ ఓ విషయం మాత్రం కాస్త ఇబ్బందిగా ఉండేది. నేను వెనక సీట్లో కూర్చుని సెల్‌లో ఎవరితో మాట్లాడినా ఇతను రెస్పాండ్ అయి జవాబులు చెప్పేవాడు!

"మినర్వాలో రేపు కాఫీకి కలుద్దామే... తర్వాత నేను ఆఫీస్‌కి వెళతాను" అని మా ఫ్రెండ్‌కి చెపుతుంటే,

వెంటనే "రేపు మనం మా టీ.వీ.కి వెళ్ళాలి. కుదరదు మేడం" అనేవాడు. ఎంత రహస్యంగా మాట్లాడినా వినేవాడు.

"ఆ సినిమా పెద్దగా బాలేదట టాక్ విన్నాను" అని నేను చెపుతుంటే,

"ఎవులు చెప్పిండ్రు?.... బి.సీ.లల్ల మంచిగా నడుస్తుంది" అని వాదించేవాడు.

ఇంకా కొన్ని ప్రైవేటు విషయాలు నేనూ మా ఆయనా మాట్లాడుకుంటున్నా మధ్యలో కాంతారావు జోక్యం ఉండేది... 'నాకెందుకులే' అని ఏ విషయం గురించీ అనుకునేవాడు కాదు! పైగా ఇతనికి సెంటిమెంట్స్, సూపర్ సిట్యుయేషన్స్ బిలీఫ్స్ ఎక్కువ! మా ఇంటి ఎదురుగుండా వాళ్ళు తుమ్మితే కారు బయటకి తీసేవాడు కాదు! నాకు ఎంత లేటైనా అరే!

పోనీ... ఇన్ని చేసినా మంచి డ్రైవరా అంటే అదీ లేదు. ఓ కన్ను సరిగ్గా కనపడదని చేరిన పదిరోజులకి డివైడర్‌ని గుద్ది చెప్పాడు.

"కళ్ళు పరీక్ష చేయించుకోమంటే, నాకు ఏమంత వయసు మించిపోయిందని? మంచిగ కానొస్తది" అనేవాడు.

మా వారు ఇతని డ్రైవింగ్‌లో వస్తే "గేరు మార్చవేంటి? ఇండికేటర్ వెయ్యవేంటి? లెఫ్ట్‌కి తిప్పాల్సినప్పుడు ఇంత మధ్యలో ఎందుకు తీసుకెళుతున్నావ్?" అని ప్రశ్నలు వేస్తే ఓసారి మధ్యలో ఆపేసి "సార్ వస్తే నేను నడపను... ఆయన్నే నడుపుకోమనండి" అన్నాడు. దాంతో నేను ఈయన్ని 'షటప్' చేయించాను. నాకు ప్రొద్దుట లేస్తే కాంతారావ్ తప్ప ఈయన ఉండరుగా! ఈయన జహీరాబాద్ నుండి వారానికి రెండూ రోజులే వచ్చి  కార్లో తిప్పితే నా ఉద్యోగాలు ఉంటాయా మరీ?

కాంతారావు కోపానికి బలయింది ఒక్క మా వారే కాదు. ఎనభై దగ్గర పడుతున్న మా పెద్దమ్మ కూడా "వాట్ ఈజ్ దిస్ నాన్‌సెన్స్? స్పీడ్ బ్రేకర్లు వసే ఇలా ఎత్తి కుదేస్తున్నాడేంటి? నాకు అసలే స్పైనల్ కార్డు సర్జరీ అయింది. హీ డజ్ నాట్ నో డ్రైవింగ్" అంటే, "

"ఈవిడ్ని ఇంకెప్పుడూ మనం ఎక్కించుకోవద్దు" అని తేల్చిచెప్పేసాడు.

నేను మధ్యాహ్న భోజన సమయంలో ఏ ఆఫీసులో ఉంటే అక్కడ ప్రొడక్షన్ వాళ్ళు తెప్పించిన ఫుడ్ కానీ, నేను ఇంటి నుండి తీసుకెళ్ళిన భోజనం కానీ తింటాను. కానీ కాంతారావ్ కొన్ని ఏరియాల్లో తినడు! కొన్ని ఆఫీసుల్లో తినడు. "నేను వైట్ లోటస్ కంపెనీకి వెళ్ళి తినొస్తాను. వాళ్ళు అయితే సన్న బియ్యం వండుతారు" అనేవాడు.

ఒక్కోసారి "ఇదేం ప్రొడక్షన్? చికెన్, మటన్ రోజూ పెడతల్లేరు" అని పోట్లాట వేసుకునేవాడట.

అసలు ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ యాభై ఏళ్ళ పెద్దమనిషికి గర్ల్‌ఫ్రెండ్స్ ఎక్కువ! కాసేపు మనం బ్యాంక్ దగ్గర ఆపి, లోపలికెళ్ళి పని చూసుకుని వచ్చే లోపల అక్కడ మిరపకాయ బజ్జీల బండి అమ్మాయికి నెంబర్ ఇవ్వడం, ఆమెకి 'మాటీవీ'లోనో, ఏ సినిమా ఆఫీస్‌లోనో పని ఇప్పిస్తానని మాటలు ఇవ్వడం, జరిగిపోయేవి. కారు కదలగానే ఆమె ఫోన్ చేసేది! ఇతగాడు ముసి ముసి నవ్వులతో "తర్వాత చేస్తా.... మేడం ఉంది" అనేవాడు. అతనికి మాత్రం అబ్సల్యూట్ ప్రైవసీ కావాలి. నేను సిగ్గు విడిచి "ఎవరు కాంతారావ్? ట్రాఫిక్‌లో ఉన్నప్పుడు ఫోన్స్ తియ్యకు" అంటే "ఇందాకా నువ్వు బ్యాంక్‌లో కెళ్లినప్పుడు, మాట ముచ్చటయింది అన్నట్లు..... నౌకరీ కావాలంట పాపం... మొగుడు ఇడిసి ఆర్నెల్లు అయిందట... ఇంకోడితో వస్తే ఆడు ఈమె పిల్లల్ని సాక్తలేడంట" అని మొత్తం గ్రంథం చెప్పుకొచ్చేవాడు!

అలా ఒక్కో ఆఫీసు దగ్గరా, వాచ్‌మెన్ కూతురో, అక్కడ ఊడ్చే ఆమెనో, తమలపాకులు అమ్మే మనిషో... గర్ల్ ఫ్రెండ్స్‌గా మారేవారు. నాకు తర్వాత తెలిసింది ఇతగాడికి రెండు ఫ్యామిలీస్ ఉన్నాయని. నేను ఈ విషయం తెలియగానే మా వారి మీద గయ్యిమన్నాను. "మనం ఇచ్చే జీతంలో డ్రైవర్ రెండు ఫ్యామిలీలు మెయిన్‌టెయిన్ చేస్తున్నాడు... మీరు ఒక్కదానికే బడ్జెట్ అంటూ ఖర్చులకి ఇదైపోతారే?" అని.

ఆయన "ఓ సారి కాంతారావ్ దగ్గర ట్రైయినింగ్ తీసుకోవాలి... గర్ల్‌ఫ్రెండ్స్‌ని ఎలా పడతాడో?" అన్నారు.

మరి ఇన్ని అవలక్షణాలున్న ఇతగాడిని సంవత్సరం పాటు ఎందుకు భరించావమ్మా? అని మీరు అడగొచ్చు !.... న్యాయంకూడానూ. నా బలహీనత వల్ల. డ్రైవర్ ఇల్లు దగ్గరగా లేకపోతే నేను ఇన్ సెక్యూరిటీ ఫీల్ అవుతాను. ఏ తెల్లవారు ఝామునో మనం ఎయిర్ పోర్ట్‌కి వెళ్ళాల్సొస్తే వాళ్ళు సెల్ ఆఫ్‌లో పెడతారు. మధ్యాహ్నాలూ, ఇష్టం లేకపోతే కూడా పెట్టొచ్చు. అది వేరే సంగతి! అలాటప్పుడు మనం మనిషిని ఇంటికి పంపించేటట్లు ఉండాలి అన్న మూఢత్వంలో ఉండే దాన్ని!

అంతేకాదు... కాంతారావు చేరిన మొదటి క్షణంలో మా ఆయన "నాకు వీడు నచ్చలేదు... తీసేయ్" అన్నారు. నా సెలెక్షన్‌ని తప్పు పట్టారు. అది ఇంకో కారణం!

కాంతారావ్ వల్ల నేను ఒక్కదాన్నే కాదు. నా సమస్త బంధు జనం ఇబ్బంది పడ్డారు. అందులో మా పరాంకుశం బాబాయ్ అతి ముఖ్యుడు. ఎందువల్ల అంటారా? మీరు కొన్ని వలయాలు తిప్పుకుంటే ఆ ఫ్లాష్ బ్యాక్‌లోకి తీసుకెళతాను...

అవి 1960 మే...... మా పిన్నిని ఆంధ్రా నుండి హైదరాబాద్ తీసుకొచ్చి ఇక్కడ సంబంధాలు చూస్తున్నారట. ఆ కార్యక్రమంలో భాగంగా ఆవిడ బి.హెచ్.ఇ.ఎల్ లో ఉన్నప్పుడు ఇదే పేరుకల యువకుడ్ని... అప్పట్లో యువకుడు పాపం... ఇంటి పక్కన ఉంటే, ఆవిడ బాబాయ్ సంబంధం చూడాలనుకున్నాడు. ఆ కాంతారావ్ పేరుకల పెళ్ళి కొడుకుని మా పిన్ని సరిగా చూడనైనా చూసిందో లేదో కానీ, అతను హోలీ పండగ నాడు "కొద్దిగా రంగు పూస్తా.." అని ఈవిడ ముంజేతి మీద రంగు అద్దాడట. ఆ తరువాత ఆ సంబంధం కుదరలేదు.... ఈవిడ్ని ఇష్టపడి వరుసకి మావయ్య అయిన మా పరాంకుశం బాబాయ్ చేసుకున్నాడు! కానీ ఆ పేరుకల వాళ్ళని మా బాబాయ్ క్షమించలేకపోతున్నాడు. నేను "మా కాంతారావ్ అన్నం తిన్నాడా?" అనో.... "కాంతారావ్ వచ్చాడా" అనో అన్నప్పుడల్లా "అబ్బా.. గుర్తు చెయ్యకే!" అని తెగ బాధపడేవాడు. ఈ కాంతారావ్‌ని తీసేసానని మా బాబాయ్‌కి ఇంకా చెప్పలేదు. చెపితే బోలెడు సంతోషిస్తాడు పాపం!

ఓ సారి గొల్లపూడి మారుతీరావుగారూ, వంగూరి చిట్టెన్‌రాజుగారూ, నేనూ కలిసి మొదటిసారి మల్లాది వెంకట కృష్ణమూర్తిగారి ఇంటికి వెళ్ళాము. దారి తెలీక ఎడ్రెస్ అడగడానికి నేను ఫోన్లో "గాంధీనగరా?" అంటే "నాకు తెలుసు గాంధీ నగర్" అంటాడు మా కాంతారావు.

"నీకు మల్లాదిగారిల్లు తెలుసా?" అని గొల్లపూడి గారు అడిగితే "తెల్వద్" అంటాడు. మరి అలాంటప్పుడు ఎడ్రెస్ అడగనీ" అంటే వినడు!

"నేను కెనరా బ్యాంక్ దగ్గరా?" అని ఫోన్లో అడుగుతుంటే, మళ్ళీ "నాకు ఎరికెనే" అంటాడు.

"నీకు మల్లాదిగారిల్లు తెలుసా?" అని మళ్ళీ గొల్లపూడిగారు అడిగితే" ఎవులు మల్లాది?" అంటాడు.

"కాంతారావ్ నువ్వు కాసేపు మాట్లాడకూ!" అని నేనన్నా పట్టించుకోడు. నన్ను ఎడ్రెస్ అడగనివ్వడు!

"నాకు తెలుసు... ఈ ఏరియాలోనే పుట్టి పెరిగినా.." అని నేను మల్లాదిగారి ఎడ్రెస్ అడుగుతుంటే బోలెడు అఫెండ్ అయ్యాడు. తర్వాత తెలిసింది అదొక్కటే ఏరియా మీద కాంతారావుకి గట్టి పట్టు! కాసేపు కూడా నోరుమూసుకుని కూర్చోలేని వ్యక్తి మా కాంతారావు. పాత సినిమా పాటలు వస్తుంటే రెచ్చిపోయి మనం వద్దన్నా ఆ కథంతా చెప్పేస్తుంటాడు.

గొల్లపూడిగారు కారు ఎక్కి కాంతారావు పక్కన కూర్చున్నాక, నేను "ఆయన ఎవరో తెలుసా? అంటే "నాకెందుకు తెల్వద్.. సినిమాలల్ల కమీనే పనులన్నీ చేస్తుండె గదా!" అన్నాడు. ఆయనకీ, మన వంగూరిగారికీ ఆ భాష సరిగ్గా అర్థం కాదు కనుక బ్రతికిపోయాను!

కాంతారావు దాదాపు ఏడాది పనిచేసినా నేను అతనిలో చూడని ఒక్కటే. అది నవ్వు! కనీసం చిరునవ్వు నవ్వేవాడు కాదు. పక్కన అక్కినేని నాగేశ్వరరావుగారు ఓసారి కూర్చున్నారు... రామానాయుడుగారు ఓసారి కూర్చున్నారు.... పరుచూరిగారూ, గొల్లపూడిగారూ, సినీతారలు లక్ష్మి, స్నేహ... ఇలా ఎవరు కూర్చున్నా మన కాంతారావ్ మొహం సీరియస్సే!

అలాంటి కాంతారావ్‌ని నేను పనిలోంచి తీసెయాల్సి రావడం మాత్రం అనివార్యం అయింది.

పట్టపగలు... నేను చెపుతున్నా పట్టించుకోకుండా ఆగి ఉన్న నీళ్ళ ట్యాంకర్‌ని గుద్దేసాడు. కారు ముందు భాగం పప్పు పప్పు అయింది. వెనక మమ్మల్ని ఫాలో అయి వస్తున్న రేడియో క్యాబ్ గుద్దెయ్యడంతో వెనక భాగం నుజ్జు నుజ్జు అయింది. మధ్యలో ఉన్న నేను చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనయి బయటపడ్డాను. తలకి దెబ్బ తగిలి ఓ చెంబెడు రక్తం పోయి ఉంటుంది ముక్కులు నుండి!

నక్షత్రాల ఆస్పత్రిలో అన్ని స్కానింగ్‌లూ ఎక్స్‌రేలూ, ట్రీట్‌మెంటూ అయి ఏమీ కాలేదని చెప్పి బిల్లు చేతిలో పెడితే చుక్కలు కనిపించాయి! ఇన్సూర్సెతో బాగుచేయించి కారు అమ్మితే ఏభైవేలు వచ్చాయి...

ఆ కారుని రోడ్డుమీద నుండి తొలగించడానికీ, షెడ్డులో వారం పెట్టినందుకూ బోలెడు ఖర్చు అయింది. నా పనులన్నీ ఆగిపోయాయి. ఆరోగ్యం పాడయింది. ఆ చిరాకులో నేనున్నప్పుడే "నా భోజనం సంగతో?" అని అడిగి నాకు తెలీకుండా మా అబ్బాయి దగ్గరా, మా అబ్బాయికి తెలీకుండా నా దగ్గరా చెరో వందా పట్టుకుపోయాడు ఆస్పత్రిలో! అన్నట్లు... కాంతారావ్‌కి ఏమీ కాలేదు. కనీసం చేతులవీ కూడా కొట్టుకు పోలేదు... అది నా అదృష్టం!

కాంతారావ్‌ని తీసెయ్యాలని నాకు బలంగా ఎప్పుడనిపించిందంటే, మర్నాడు పొద్దుటే, మా అమ్మకి ఫోన్ చేసి "అమ్మ మాట్లాడుతుందా? లేచిందా? " అని అడిగాడట. నేను మురిసిపోయాను. కానీ వచ్చీ రాగానే "మా తమ్ముడి బిడ్డ పెద్దమనిషైంది... నేను పోవాలి... నాకు నా జీతం ఇచ్చెయ్యి.." అన్నాడు అప్పుడింకా నెల జీతం తీసుకుని వారం కాలేదు! నా ఆరోగ్యం గురించి ఒక్కమాటా మాట్లాడలేదు. అప్పుడిక నా మనస్సు విరిగిపోయింది.

కానీ.... సుఖం విలువ తెలియాలంటే కష్టాలు పడాలి అని తెలిసింది! అసలు ప్రొద్దుటే కాంతారావ్ రాడంటేనే ఎంతో రిలీఫ్‌గా ఆనందంగా ఉంటోంది!

**దటీజ్ కాంతారావ్!**